క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు



దాత వెంకటరత్నంకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు శనివారం వేర్వేరుగా రూ.1,60,616 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంకు చెందిన వడ్లపూడి వెంకటరత్నం రూ.1,10,500, పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు చెందిన గమిని నాగేశ్వరరావు రూ.50,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

పారిజాతగిరిలో పూజలు



విశేషాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారికి శనివారం ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వర్షం కురుస్తున్నా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకునేందుకు ఆలయానికి వచ్చినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ మొదలుకుని తోమాలసేవ, బాలభోగ నివేదన, తీర్థప్రసాద గోష్టి తదితర పూజలు అర్చకులు నిర్వహించారు. స్వామి వారి అలంకరణకు, ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణకు దాతలుగా జంగారెడ్డిగూడెంకు చెందిన నిమ్మగడ్డ సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు, వారి కుటుంబసభ్యులు వ్యవహరించినట్లు ఈవో తెలిపారు. దాతలను అర్చకులు వేదాశీర్వాదంతో సత్కరించారు. కార్యక్రమాలను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

చిన్నారులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: దాతల సహకారం మరువలేనిదని కుంతలగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ పులి నాగరత్నం పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణతో కలిసి పూర్వపు ఎస్‌బీఐ మేనేజర్ కాత్రం వెంకటనాగేశ్వరరావు రూ. 5 వేలు విలువైన రాత పుస్తకాలను 1వ తరగతి నుంచి 5వ తరగతి చదువుతున్న 45 మంది బాలబాలికలకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, బాలబాలికలు పాల్గొన్నారు.

సెలవు దినాల్లో తరగతులను అడ్డుకున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న శశి, ఆదిత్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలో రెండో శనివారం క్లాసులు నిర్వహిస్తోన్న పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వద్దకు పీడీఎస్‌యూ నాయకులు వెళ్లి అడ్డుకొని విద్యార్థులను ఇంటికి పంపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు కూడా గడవకముందే అప్పుడే ఏలూరులోని కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. రెండో శనివారం సెలవు అయినప్పటికీ యథేచ్ఛగా క్లాసులు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారని నాని ప్రశ్నించారు. శశి క్యాంపస్‌లో ఇంటర్మీడియెట్ క్లాస్ నిర్వహిస్తున్నారని ఆర్‌ఐఓకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని నాని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర శాఖ నాయకులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు తడిసిన విద్యుత్ స్తంభాలు, తీగలను రైతులు తాకవద్దని విద్యుత్‌శాఖ ఏడీఈ త్రివాస్ సూచించారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ వర్షం కురిసినప్పుడు పొలాల్లోని విద్యుత్ మోటార్లను ఆన్ చేయవద్దని రైతులకు సూచించారు. విద్యుత్ స్తంభాలు పొలాల్లో ఒరిగిపోయే పరిస్థితి ఉంటే తక్షణమే ఆయా మండలాల్లో పనిచేస్తున్న విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యుత్ తీగలు, మోటార్లు తెగి ఉంటే వాటిని ముట్టుకోకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పూర్తి అప్రమత్తతతో రైతులు, కూలీలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఏజెన్సీలో భారీ వర్షాలు



పట్టెన్నపాలెంలో డైవర్షన్ రహదారి మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గిరిజన ప్రాంతంలో గత రెండు రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకూ మబ్బులు కమ్మి జోరుగా వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. బుట్టాయగూడెం మండలంలో సుమారు 15.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెప్తున్నారు. అలాగే వర్షాలు ఎడతెరిపిన కురవడం వలన పంట చేలల్లోకి, చెరువుల్లోకి జల్లేరు జలాశయం, పోగొండ రిజర్వాయర్, కొవ్వాడ ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుంది. మరోపక్క రైతులు ఖరీఫ్ సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో 1182 ఎకరాల్లో వరినారుమడులను రైతులు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. 37967.5 ఎకరాల్లో వరి పంటలు పండించే విధంగా కృషి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పొంగుతున్న వాగులు

పోలవరం రూరల్: పోలవరం మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తోంది. కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కొండ వాగులు కూడా పొంగి ప్రవహిస్తున్నాయి. ఇసుక కాలువ పొంగి ప్రవహించి కడెమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరి నదిలోకి కలుస్తోంది. కొవ్వాడ కాలువ అధిక జలాలు పట్టిసం ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరి నదిలోకి చేరుతోంది. పల్లపు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ప్రధాన రోడ్డు మార్గాలు జలమయమయ్యాయి.

రహదారి మీదుగా వరద నీరు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలో శనివారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. పట్టెన్నపాలెంలో జల్లేరు వాగుపై నిర్మించిన డైవర్షన్ మీదుగా వరద నీరు ప్రవహించింది. రహదారి మీదుగా వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు కురవడంతో వరద ఉధృతి సమయాల్లో వాగులు దాటే ప్రయత్నాలు చేయరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. జల్లేరు వాగుపై వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ రహదారి మీదుగా ఏజెన్సీ మెట్ట ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వాగు ఉధృతిగా ప్రవహించినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఏజెన్సీ మెట్ట ప్రాంత మండలాల ప్రజలు కోరుతున్నారు.



పోలవరంలోని ఓ వీధిలో నిలిచిన వర్షం నీరు



కడెమ్మ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి చేరుతున్న ఇసుక కాలువ నీరు



బుట్టాయగూడెంలో వర్షం కురుస్తున్న దృశ్యం

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి గడువు పెంపు

కామవరపుకోట: ఆడమిల్లి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కొత్త షెడ్యూల్ ప్రకారం 23వ తేదీ నుంచి 26 వరకు ఆప్షన్ల ఎంపికకు, 27న ఎంపిక చేసుకున్న ఆప్షన్లలో మార్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని, 31వ తేదీన సీట్ల కేటాయింపు, ఆగస్టు 1వ తేదీన విద్యార్థులు కళాశాలలో రిపోర్ట్ చేయాలని, అదే రోజునుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మహిళా విద్యార్థినులకు కళాశాల ఆవరణలో ఉచితంగా హాస్టల్ సదుపాయం కల్పించడం జరుగుతుందని, సద్వినియోగపర్చుకోవాలని ఆయన కోరారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువకుడి అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై వై.మంగయ్య తెలిపిన వివరాలివి. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వెంపాటి వెంకట శివసాయిరాం ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన ఉద్యోగ ప్రయత్నం నిమిత్తం బెంగుళూరు వెళుతున్నట్లు కుటుంబసభ్యులకు చెప్పాడు. అప్పటి నుంచి శ్రీనివాసరావుకు ఫోన్ చేస్తున్నా పని చేయడంలేదని, కుమారుడు ఎక్కడ ఉన్నాడో తెలియడం లేదని, ఆచూకీ కనుగొనాలని తండ్రి శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: జామాయిల్ చెట్టు కొమ్మ పడటంతో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ మృతిచెందినట్లు ఎస్సై జి.జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రాజీవ్ నగర్‌కు చెందిన చెందిన గుత్తు వీరమణి (54) ఈ నెల 12వ తేదీ ఉదయం 11 గంటల సమయంలో ఇంటి నుంచి రోడ్డు మీదకు నడిచి వస్తుండగా, ఇంటి ఈశాన్యం మూలగా ఉన్న జామాయిల్ చెట్టు పెద్ద కొమ్మ విరిగి ఆమెపై పడింది. తీవ్రంగా గాయపడిన వీరమణిని, ఆమె కుమారుడు నాగమల్లేశ్ స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా, ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యలో వీరమణి మృతిచెందింది. ఆమె కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రామావతారంలో జగన్నాథుడు



రామావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథ స్వామి

ద్వారకాతిరుమల: రామావతారంలో జగన్నాథ స్వామివారు శనివారం భక్తజనులకు దర్శనమిచ్చారు. ధనుర్బాణాలను ధరించి సీతాదేవితో కొలువైన స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి పూజించారు. పితృవాక్య పరిపాలనతో మానవుడు ఎంత నీతివంతునిగా జీవించవచ్చో తెలియజేసినది రామావతారం. అట్టి రామావతారంలో జగన్నాథుడు శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురం ఆలయంలో దర్శనమివ్వడం భక్తులను అలరించింది.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు.. పట్టించుకోని అధికారులు



పోలవరంలోని వై.జంక్షన్ ప్రాంతంలో రోడ్డుపై వేలాడుతున్న విద్యుత్‌వైర్లు

పోలవరం రూరల్: పోలవరంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో విద్యుత్ వైర్లు దిగువకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. గట్టిగా గాలి వేస్తే తెగి పడేలా ఉన్నాయి. అయినా నిత్యం ఇటువైపే తిరిగే అధికారులు గమనించకపోవడం విశేషం. పోలవరం నుంచి ఇటుకలకోట వెళ్లే మార్గంలో వై.జంక్షన్ వద్ద చెట్లకొమ్మల మధ్యలో విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. సమీపంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉంది. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఇదే ప్రదేశంలో ఉన్నాయి. అంతేగాక పోలవరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారుల కార్యాలయాలు కూడా ఇక్కడే ఉన్నాయి. ఈరోడ్డు మార్గంలో అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అంతేగాక ఒక ప్రైవేట్ పాఠశాల కూడా ఉంది. ఏజెన్సీ పంచాయతీలైన ఇటుకలకోట, వింజరం, మామిడిగొంది, సింగన్నపల్లి, చేగొండిపల్లి పంచాయతీల పరిధిలోని ప్రజలు నిత్యం వారి అవసరాలు నిమిత్తం పగలు, రాత్రి ఇటువైపుగానే ప్రయాణిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు గాలివానలతో విద్యుత్‌వైర్లు ఊగుతూ వేలాడుతున్నా విద్యుత్ శాఖాధికారులు రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ కె.సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా, లైన్‌మన్‌ను పంపి విద్యుత్ వైర్లు సరిచేస్తామని తెలిపారు.

తరచూ విద్యుత్ అంతరాయం

ఇటీవల గ్రామాల్లో ఎక్కడో అక్కడ విద్యుత్‌వైర్లు తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్‌లు మరమ్మతులకు గురికావడం వంటి ఘటనలు జరుగుతూ తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే తిరిగి విద్యుత్‌శాఖ సిబ్బంది వైర్లు సరిచేసి మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలంటే గంటల కొద్దీ సమయం పట్టే పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ అంతరాయం ఏర్పడితే దోమలు, విషపురుగులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

అగాపే ద్వారా వీల్‌చైర్ పంపిణీ



వీల్‌చైర్ అందజేసిన అగాపే వ్యవస్థాపకుడు ఆశిబాబు

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల అవార్డ్ గ్రహీత, సమాజసేవకులు, అగాపే స్వచ్ఛంద సేవా వ్యవస్థాపకుడు బిరుదుగడ్డ ఆశిబాబు శనివారం దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను అందజేశారు. స్థానిక సూరపరాజుకాలనీలోని ఆగాపే కార్యాలయంలో జరిగిన విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సేవా కార్యక్రమంలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన బత్తిన శ్రీను (42 సం) అనే విభిన్న ప్రతిభావంతునికి రూ.20వేలు విలువైన వీల్ చైర్‌ను ఆశిబాబు వ్యక్తిగత వితరణతో అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి మాబూ సుబానీ, డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు, కార్యదర్శి బాజీ పఠాన్, కొప్పాక రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఐసీఏఆర్ డైరెక్టర్



సురేష్‌కు స్వామివారి మొమెంటోను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రీసెర్చ్ (ఐసీఏఆర్) డైరెక్టర్ డాక్టర్ కంచర్ల సురేష్ శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు స్వామివారి మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి తొమ్మిది మంది విద్యార్థుల ఎంపిక

టి.నరసాపురం: మండలంలోని అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ డీఎస్ బి శంకరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాల నుంచి 2024 మార్చిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో 9 మంది ట్రిపుల్ ఐటీకీ ఎంపికయ్యారు. వీరిలో నలుగురు నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా, మరో నలుగురు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి, ఇంకొకరు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరిని మండల విద్యాశాఖాధికారులు టి.రామూర్తి, ఎస్.కళ్యాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- డయేరియా, డెంగీ నివారణకు సహకరించాలి
- వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచనలు





చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది, ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి

ద్వారకాతిరుమల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే అనారోగ్యాల బారన పడతారని మండల వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ సూచించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను అందరూ పాటించాలన్నారు. అప్పుడే సీజనల్ వ్యాధుల నుంచి తప్పించుకోగలమన్నారు. గ్రామ పంచాయతీ ఏరియాలో స్టాప్ డయేరియా, డెంగీ వ్యతిరేక కార్యక్రమాలు అమలులో ఉన్నాయని, వీటి నివారణకు గ్రామస్తులు సహకరించి, ఇళ్ల వద్దకు వచ్చే వైద్య సిబ్బంది సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే చేపట్టాల్సిన చర్యలను పంచాయతీ అధికారులకు, ప్రజలకు డాక్టర్ ప్రవీణ్ కుమార్ వివరించారు.

చేపట్టాల్సిన చర్యలివీ..

- క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలి. తాగు నీటి పైపులకు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతు చేయించాలి.
- వీధి కుళాయిలకు ప్లాట్ ఫారములు ఉండాలి.
- ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి శుభ్రపరచుకోవలెను.
- దోమలు పెరగకుండా పరిసరాల్లోని నీటి కుంటలను వెంటనే పూడ్చివేయవలెను.
- పూడ్చడానికి వీలులేని నీటి కుంటలలో కిరోసిన్ గానీ, మడ్డి ఆయిల్ గాని వేస్తే దోమల లార్వా నశిస్తుంది.
- మురుగు కాల్వల్లో ఉన్న అడ్డంకులను తొలగించి, మురుగునీరు ఎప్పటికప్పుడు పారే విధంగా చేయాలి.
- గ్రామ పరిసరాల్లోని చెత్త చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించి, బ్లీచింగ్, సున్నాన్ని 1:4 నిష్పత్తిలో కలిపి చల్లాలి.
- వర్షపు నీరు చేరకుండా గృహ పరిసరాల్లో ఉన్న పనికిరాని వస్తువులు, రోళ్లు, పగిలిపోయిన మట్టి కుండలు, కూజాలు, టైర్లు, పూల కుండీలు, తాగి పారవేసిన కొబ్బరి బొండాలు మొదలైన వాటిని తొలగించవలెను. అలాగే సెప్టిక్ ట్యాంక్ ఎయిర్ పైపుల పైనగల జల్లెడలకు పలుచని వస్త్రాన్ని చుట్టించాలి. ఇలా చేస్తే సెప్టిక్ ట్యాంక్ లోపల దోమలు గుడ్లు పెట్టకుండా అరికట్టవచ్చు.
- ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా నీటి తొట్టెలను శుభ్రపరచి, ఆరబెట్టి, తిరిగి నీటితో నింపుటవల్ల దోమ లార్వా పెరుగుదలను అరికట్టవచ్చు. ఈ కార్యక్రమానికి ఆరోగ్య సిబ్బందితో ప్రజలు సహకరించాలి.
- దోమ లార్వా నివారణకు 10 లీటర్ల నీటిలో 5 మీ.లీ ఎబేట్ ద్రావణాన్ని కలిపి నీటి నిల్వలపై పిచికారీ చేయాలి.
- దోమల నివారణకు ఒక పార్టు మలాథియాన్‌కు, 10 పార్టుల నీటిని కలిపి నాప్సాక్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయాలి.
- దోమల నివారణకు ఒక లీటరు పైరెత్రమ్‌కు 20 లీటర్ల డీజిల్ కలిపి ఫాగింగ్ నిర్వహించాలి.
- పందులను నివాసిత ప్రాంతాలకు కనీసం 5 కిలోమీటర్ల దూరంలో అయినా ఉంచాలి.
- కలుషిత నీటిని తాగడం వల్ల డయేరియా, కలరా, టైఫాయిడ్, పోలియో, కామెర్లు వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తాయి. ప్రజలు సురక్షితమైన మంచి నీటిని వినియోగించాలి.
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వీధుల్లో లభించే అపరిశుభ్ర ఆహారం, తినుబండారాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. వాటిని తినకూడదు.
- విరేచనాలు, వాంతులు, జ్వరం ఉన్న వారు అశ్రద్ధ చేయకుండా వెంటనే ప్రభుత్వ వైద్యులను, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను, లేదా మీ సచివాలయం ఏఎన్‌ఎంలను సంప్రదించి తక్షణ వైద్యసహాయం పొందాలి.
- దోమ కాటు వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటి ప్రమాదకర వ్యాధులు వస్తాయి. దోమలు పెరిగే అవకాశం లేకుండా మీ పరిసరాలను ఎల్లప్పుడూ తేమ, నీరు నిలువ లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- పొడి వతావరణంలో దోమలు పెరిగే అవకాశం ఉండదు గనుక మీ ఇంటి ఆవరణలో 24 గంటలకు మించి నీరు నిల్వ ఉండే నీటి తొట్టెలు, పాత వంట పాత్రలు, సీసాలు, పూల కుండీలు, పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ పైపులను గమనించి నీరు నిల్వలేకుండా చూడాలి.
- పంచాయతీ డ్రెయిన్‌లలో చెత్త వేసి పారిశుధ్య సమస్యలు కలుగ జేయవద్దు.
- డ్రెయిన్ లేని ఏరియాలలో, నీరు నిల్వ ఉండే మంచినీటి కుళాయిల వద్ద ఇంకుడు కుంటలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఖాళీ స్థలాల్లో వాటి యజమానులు తక్షణమే పిచ్చిమొక్కలు తొలగించాలి.

వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- అధికారులు స్పందించాలని వేడుకోలు



చింతలపూడి రత్నా కాంప్లెక్స్ సమీపంలో ఏర్పడిన పెద్ద గోతుల్లో దిగబడిన లారీ



ప్రధాన రహదారిపై గుర్రాజులకుంట చెరువు వద్ద రోడ్డు మార్జిన్‌లలో చెత్త వేస్తున్న దృశ్యం

చింతలపూడి: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులు సైతం ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. ఇటీవల అల్ప పీడనాలు, రుతుపవనాల ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు కూడా గోతులు పడి ప్రయాణికులకు సంకటంగా మారాయి. నియోజకవర్గంలో 284 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారులు, 555 కిలోమీటర్ల మేర పంచాయతీ రాజ్ రహదారులు ఉన్నట్లు అంచనా. చింతలపూడి మండలంలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 145 మిల్లీ మీటర్లు కాగా 328.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం కంటే 126.62 శాతం అధిక వర్షపాతం నమోదైంది. దీంతో రోడ్లు ఎక్కడికక్కడ పెద్ద, పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ముఖ్యంగా చింతలపూడి పట్టణంలో రత్నా కాంప్లెక్స్ సమీపంలో పెద్ద గోతులు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. వర్షపు నీటితో నిండిన గోతుల్లో వాహనాలు దిగబడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు వాపోతున్నారు. చింతలపూడి నుంచి వయా టి నరసాపురం, జంగారెడ్డిగూడెం వెళ్లే ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. గోతులు తప్ప అసలు రోడ్డే కనపడటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. చింతలపూడి నుంచి సుమారు 8 కిలోమీటర్ల రహదారి అభివృద్ధి చేస్తే చాలు ఈ రహదారికి పట్టిన పీడ వదులుతుందని అభిప్రాయ పడుతున్నారు. దీనికి తోడు నగర పంచాయతీ సిబ్బంది ప్రతిరోజు నగరంలో సేకరించిన చెత్తను ఈ రహదారి పైనే గుర్రాజులకుంట చెరువు వద్ద పోస్తుండటంతో దుర్గంధం వెదజల్లడమే కాక రాకపోకలకు కూడా ఇబ్బందికరంగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు తిరిగే రహదారి కావడంతో తక్షణం రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు. అదే విధంగా పట్టణంలో మెయిన్ రోడ్డు గోతులు కూడా పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.